

# మనిషికి కావలసిన మరొకటి

యస్. కాశీవిశ్వనాథ్

---

*"ఎదుటివారికి చెప్పేటందుకె నీతులు వున్నాయి!" అనుకున్నంతకాలమూ సమాజ జీవితానికి ఎదుగుదల వుండదు. చెప్పే మనిషికీ, వినే మనిషికీ కావలసిన మరొకటి వుంది. ఆ ఒక్కటి లేకపోతే అన్నీ లేనట్లే!*

---

రాఘవేంద్రరావుకి నిద్ర పట్టడంలేదు.

టేబిల్ మీద నలభయ్యారు కథల వ్రాత ప్రతులు రెపరెప లాడుతున్నాయి. అవి కాగితాలు కావు, కథలు! వర్తమాన సమాజంలోని చీకటి వెలుగులకి ప్రతిబింబాలు నిత్య జీవన సత్యాల నిక్షిప్తాలు ఆ కథలు వాటిని చదవాలి. చదివి వుత్తమంగా వున్న మూడు కథల్ని ఎంపిక చేయాలి.

అది కష్టమైన పనే. మల్లెలు, గులాబీలు, విరజాజి, చామంతి ఎదటపెటి అందులో ఏది మంచిదో చెప్పమంటే ఏం చెప్పడం? చెప్పడం కష్టమే- కానీ చెప్పక తప్పదు. తను కథలకి గుణనిర్ణేత!

ఆ పన్నెండు కథల్లో ప్రపంచం పరుచుకుని వుంది. మనిషి విశ్వరూపానికి కథలు నిశ్చలన చిత్రాలు.

అన్ని కథలూ మంచివే!

కానీ-

ఓ కథ - ఒకే ఒక్క కథ రాఘవేంద్రరావుచేత ఆరుసార్లు చదివించింది.

కథా వస్తువు కొత్తదేం కాదు-పాతదే! శిల్పమేం అసాధారణమైందికాదు గానీ ప్రశంసనీయమయిందే!

సమస్యపేరు- "వరకట్నం."

కథపేరు - "ప్రతీ ఇంటికథే"

తనని ఆకట్టుకున్నది కథావస్తువూ కాదు, శిల్పమూ కాదు - కథకు రచయిత యిచ్చిన ముగింపు.

ఖ్యంగా ఆఖరి పేరు.... "కట్నం ఓ సంప్రదాయ మనుకుంటే - సంప్రదాయ మనేది మనిషి మనుగడకు మంచిగంధం

## నెలకు రు. 1000/-లు సంపాదించండి

ఎలక్ట్రిక్ గైడ్ రు. 10/-; ఫొటోగ్రఫీ రు. 6/-; రేడియోగైడ్ రు. 10/- వివాహపు జీవితం 100 బొమ్మలతో రు. 7/-; మెడికల్ సెక్స్‌గైడ్ 88 బొమ్మలతో రు. 10/-; డ్రాయింగ్, పెయింటింగ్స్ గైడు రు. 8/-; టైలరింగ్ & కటింగ్ రు. 7/-; 350 ఎంబ్రాయిడరీ డిజైన్లు రు. 8/- సబ్బు తయారీ రు 5/-; 300 కుటీర పరిశ్రమ గైడు రు 15.

ప్రతి ఒక్కటి పోస్టేజి 1.50.

ILFA BOOK DEPOT
Aligarh-25.

## సైకో - సెక్సో - థెరపి

సంతానమునకు, గర్భ నిరోధమునకు, సుఖ వ్యాధులు, బహిస్టు వ్యాధుల నివారణకు, వక్షోజ సౌందర్యం కొరకు, బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం, అంగం చిన్నదైనచో, నరముల బలహీనత పోగొట్టి వీర్య వృద్ధికి, వృద్ధాప్యములో యవ్వన శక్తి పొందుటకు, ధాతు పుష్టికి, ఇంకా అనేక అంతరాంగిక సమస్యల పరిష్కారమునకు సంప్రదించండి.

డా॥ వై. వి. యస్. మోహనరావు
10-19-28, దుర్గగుడి టర్నింగ్, బ్రాహ్మణవీధి,
విజయవాడ—520 001.

Suvarna

## స్వయం సంరక్షణ

(లైసెన్సు అవసరంలేదు)

క్రూరమృగాలు, మరియు దొంగల బారినుండి ఫోల్డింగ్ 50 గుళ్ళ ఆటోమేటిక్ పిస్టల్ మిమ్ములను రక్షిస్తుంది. మిరుమిట్లు గొలిపే మంటతో భయంకరమైన పెద్ద ధ్వనిని యిస్తుంది.




నలుపు రంగు గన్ ఎలువ రు. 55/-మాత్రమే లెదర్ కేసు మరియు 100 గుళ్ళు ఉచితం. పోస్టేజి రు. 5/- అదనం. అదనపు గుళ్ళు ప్రతి వందకు రు. 3/-.

AMERICAN SALES
ALIGARH—17 (U.P)


పూయాలిగాని మారణహోమంగా మారకూడదు దేవుడు సృష్టించిన జీవితాన్ని మనుషులు ముద్రించిన కాగితాలు శాసించకూడదు మగవాడు అహంకారంతో, అధికారంతో అడిగే కట్నాన్ని వినయంగా సమర్పించుకుంటూ ఆడది తనకుతానుగా అసహాయతని వెలడించుకునే దురవస్థని మనం వివాహం అని అందంగా పిలుచుకుంటే మనుషులకంటే జంతువులేనయం! స్వజాతి జంతువుతో ఎట్టి సంప్రదాయాలూ పాటించకుండానే జోడు కడతాయి. సృష్టిలో స్త్రీ పురుషులిద్దరూ సమానులే! ఇద్దరూ ఒకే తిండి తింటున్నారు. ఒకే గాలి పీలుస్తున్నారు. ఒకే ఆనందాన్ని అనుభవిస్తున్నప్పుడు ఆడదాన్ని ప్రత్యేకించి కట్నం తెమ్మనటానికి మగవాడికి ఎవడిచ్చాడు అధికారం?

మార్పు కావాలని, సంఘం మారాలని ప్రతివాడూ వుపన్యాసాలిచ్చేవాడే! కానీ ఆ మార్పును ప్రతివాడూ ఎదటి మనిషినించి ఆశిస్తున్నాడేగాని తను కోరుకున్న నూతన సమాజంలో తనే తొలిమనిషిగా మారాలని ఎవడూ తపించడంలేదు ఈ దేశంలో సాధకులకంటే బోధకులు ఎక్కువయ్యారు. అందుకే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ముప్ఫయ్యేళ్ళకి కూడా మూడు అంగుళాల ప్రగతి సాధించలేకపోయాం. కట్నం యివ్వలేని కన్నెపిల్లల కన్నీళ్ళు తుడవడానికి ఒక్క అభయహస్తం కూడా ముందుకి రావడంలేదు పెద్దలకు భయపడి యువతరం. వీళ్ళమీద చేసిన ఖర్చు కట్నం రూపంలో రాబట్టుకోవాలనుకునే పెద్దలు యిలా ఒకర్ని ఒకరు వేలెత్తి చూపించుకుంటున్నంత కాలం ఈసమస్య చావదు. యువతరం చేసే తెగింపే ఈ సమస్యకి ముగింపు" అంటూ కథలోని కథానాయకుడు కట్నం లేందే పెళ్ళి జరగదన్న పెద్దల్ని ఎదిరించి, ఆస్తిపాస్తులు వదులుకుని, సరైన ఉద్యోగం దొరక్క కూలిచేసి బతుకుతూ తను పెళ్ళిచేసుకున్న పేదింటి అమ్మాయితో "ఆశయాలు వల్లించడం వలన లాభంలేదు, ఆచరించి చూపాలి. నా ఆశయాలు నాకు పరమాన్నం పెట్టకపోయినా, నాకు కలిగిన ఆత్మ తృప్తితో నా కాయకష్టంతో యింత గంజి సంపాదిస్తాను. నేను తాగే గెంజిలో నీకూ ఓ వాటా వుంటుంది" అంటాడు.

రాఘవేంద్రరావు కళ్ళు చెమర్చాయి.

తన అల్లుడు శంకర్రావు ఈ కథలోని నాయకుళ్ళా ఆలోచించివుంటే ఎంత బావుణ్ను! అతనూ కథలు రాస్తాడు.

## గులాబి పువ్వు

తొలి పొద్దు వెలుతురులో
లేత ఎరుపు రేకులమీద
మంచుబొట్లు
మిలమిల మెరుస్తుండగా
అందంగా, అనివార్యంగా
ఎంతో సహజంగా
విచ్చుకున్న గులాబి పువ్వు
వలపులా, పొగరుగా
తలెత్తుకు నిలబడుతుంది.
అవునుగాని, మంచుబొట్లు
మచ్చుకైనా మిగలకుండా పోయిన
ఈ మలి పొద్దు వెలుతురులో
ఎవరి అనుమతి లేకుండా
ఎలా వికసించింది
నా పూల తోటలో
ఈ చిన్నారి పువ్వు?
అందంగా, అనివార్యంగా,
అసహజంగా
విప్పారిన ఈ గులాబీని
ఎలా కాపాడుకోవడం?

— శేఖర్

ఈ మధ్యకాలంలో అతని కథలసంఖ్య పెరిగింది, రచనా శిల్పం పెరిగింది— కానీ, మనసే పెరగలేదు! పెరి[...] వుంటే పెళ్ళినాడు యిస్తానని చెప్పి తన[...] యివ్వలేకపోయిన కట్నాన్ని తెస్తేనేగా[...] తిరిగి తన గుమ్మం ఎక్కవద్దని కవిత[...] శాసిస్తాడా? తెచ్చేంతవరకూ మీ అమ్మా[...] యిని మీ దగ్గరే వుంచండంటూ త[...] యింట్లో కవితని వదిలిపెడతాడా?

వియ్యంకుడితో వాగ్యుద్ధం చేస్తున్న[...] తనని శంకర్రావు పక్కగదిలోకి తీసుక[...] వెళ్ళి ఓ వుపదేశం చేసి తనకో వుపకార[...] చేసినట్టుగా చిన్నగా నవ్వాడు.

"మా నాన్నగారు మారాలని మీర[...] ఆశించకండి యుగాల తరబడి ప్ర[...]హిస్తున్న ప్రాచీన సంప్రదాయాల రక్త[...] మా నాన్నగారిలోనూ ప్రవహిస్తోంది[...] సంప్రదాయాల కోసం సమరం సాగిం[...] సంబంధాలు వదులుకోలేం. మీరు అం[...] కరిస్తే మా నాన్న అడిగిన కట్నాన్ని[...] యిప్పుడే యివ్వనక్కర్లేదు. కొంచెం టై[...] తీసుకొనే సర్దుబాటు చెయ్యండి. నేన[...] నచ్చచెప్తాను. కాకపోతే ఆయనకి చాలా స్త[...] ఎక్కువ. మాట వరసకి ఓ ప్రోనోట[...] రాసివ్వండి చాలు...."

తను నవ్వబోయి విఫలమయ్యాడు.

తన సిద్ధాంతాన్ని నమ్మినవాళ్ళు తను రాసే ప్రోనోటుని నమ్ముతామంటున్నారు. అంటే తన రచనలకన్నా ప్రోనోటుకే విలువ ఎక్కువా? ఆడపిల్లల్ని కన్న నేరానికి తన సిద్ధాంతాలకి. రచనలకి విలువ తగ్గించి, ప్రోనోటుకే విలువ యిచ్చే వాళ్ళకి తను ఎందుకు నోటు రాసివ్వాలి? తను ప్రోనోటు రాయనుకాక రాయనన్నాడు. అలా అయితే ఈ పెళ్ళి జరగదన్నాడు శంకర్రావు తండ్రి. ఇలా మొండిపట్టు పడితే నలుగుర్లో ఏ ఒక్క ఆడపిల్లకి పెళ్ళి కాదంటూ కంటనీరు ఒలికించింది పార్వతి. తను పెళ్ళంటూ చేసుకుంటే శంకర్రావునే చేసుకుంటానుతప్ప మరొకర్ని పెళ్ళాడనంది కవిత.

వీళ్ళందరి మధ్య ఏమీ అననివాడు శంకర్రావే! పార్వతి కన్నీరో, కవిత నిర్ణయమో, వియ్యంకుడి సంప్రదాయమో, శంకర్రావు మౌనమో తచేనత ప్రోనోటు రాయించింది.

"ప్రోనోట్లు రాయడంలో ఇది నా మొదటి రచన.

కథా రచయితగా ఇది నా ఆఖరి రచన. నేను ఇవాల్టినించి కథలు రాయను. నాలోని కవికి సంఘంలో ఆడపిల్లల తండ్రి రాఘవేంద్రరావుకి అభిప్రాయ భేదాలొచ్చి. రాఘవేంద్రరావు అనే వ్యక్తి నాలోని రచయితని హత్య చేశాడు. నాలోని రచయితకి సజీవ సమాధి.... ఆ సమాధి ప్రక్కనే నా కూతురి పెళ్ళి పందిరి. నా మనసు యిక స్పందించదు. స్పందించినా రచన చేయదు. ఎందుకు చేయాలి? నా రచనలోనూ కలీ జొరబడింది. రాసేది ఒకటి. చేసేది ఒకటిగా బ్రతుకుతూ నేను రచనలెందుకు చేసి పాఠకుల్ని మోసగించాలి. అందుచేతయికమీదట నేను కథలు రాయనుగాక రాయను. ఇక మీదట నేను రాసేవన్నీ ప్రోనోట్లే!"— అంటూ ఆ రాత్రే తన డైరీలో రాసుకున్నాడు రాఘవేంద్రరావు.

పెళ్ళి జరిగిన రెండు మాసాల్లోగా కట్నం సొమ్ము ఎనిమిదివేలూ యిస్తానని ప్రోనోటు రాశాడు తను.

పెళ్ళి జరిగింది

రెండు నెలలు గడిచి మరో నాలుగు నెలలయినా తను డబ్బు సర్దుబాటు చేసుకోలేకపోయాడు. రెండు నవలలు రాయండి. ఆ డబ్బు మీకు వచ్చేలా చూస్తానన్నాడు ఓ ప్రముఖ నవలా పబ్లిషరు. అతనిముందు తను నవ్వాడు. తర్వాత చాటుగా ఏడ్చాడు. "కవితకు కట్నమివ్వడానికి నేను నవల రాయాలా? స్పందించని మనసు నా చేత ఏం రాయిస్తుంది.!

ఆరు నెలలు దాటాక కవితని తీసుకుని శంకర్రావు వచ్చాడు. రాత్రి భోజనాల సమయంలో తను ఈ మధ్య రాసిన కథల గురించీ. రాస్తున్న నవల గురించీ చెప్పాడు తప్ప మరో మాటలేదు. తను కవిత జీవితం గురించి ఆలోచిస్తుంటే శంకర్రావు తన కథా వస్తువుల గురించే చెప్తున్నాడు. తను తెల్లవారి లేచేసరికి కవిత కనిపించిందిగాని శంకర్రావు కనిపించలేదు. పెళ్ళయిన రెండు నెలల్నాడు శంకర్రావుకి వుద్యోగరీత్యా తన సొంత వూరికే బదిలీ కావడంచేత ప్రస్తుతం తలిదండ్రులతోనే వుంటున్నాడు. శంకర్రావు ఏడీ అని కవిత నడిగితే తమ వూరు వెళ్ళిపోయాడని చెప్పి ఓ చీటీ అందించింది.

"మహా రచయితలైన మామయ్యగార్కి. నాకు తల్లితండ్రులు కావాలి. భార్యా



కావాలి. కానీ నా తల్లిదండ్రులకు నీ భార్య తెస్తానని చెప్పిన కట్నమే ముఖ్యంగా తోస్తోంది. వారి మూఢత్వానికి నేను విచారించడం మినహా మరేమీ చెయ్యలేను కళ్ళెదుట కవిత కనబడుతుంటే మీబాధ్యత మీకు గుర్తుంటుందని కవితని మీ యింట్లో వదిలి రమ్మన్న మా తలిదండ్రులమాటల్ని పాటించడానికి నేనెంత బాధపడ్డానో మహా రచయితలు మీరూహించగలరు ఈకష్టాల్ని కడతేర్చి కవితను మా యింటి పంపమని ప్రార్థిస్తూ.

మీ

శంకర్రావు

తనకి కోపం రాలేదు. నవ్వు రాలేదు

అందమైన అక్షరాలు, చమత్కారమైన వ్యాఖ్యలు, అసహ్యమైన భావాలు - కాగితాన్ని నలిపి పారేశాడు.

అవులింతలు వొస్తున్నాయి. చీకటి ముక్కలు ముక్కలుగా చీలిపోతూ ఆవరించుకుంటున్న వెలుతురు రేఖలకి జడిసి పారిపోతున్నవేళ కాగితంతీసి కథల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు యోగ్యమైన కథలపేర్లు, రచయితల పేర్లు రాశాడు.

ప్రథమ బహుమతి "ప్రతీ ఇంటికథే" రచయిత సుగుణ. అసలు పేరు బి. రాజారావు.

ద్వితీయ బహుమతి, తృతీయ బహుమతి కూడా రాశాక కాలకృత్యాలు తీర్చుకునే కార్యక్రమంలో పడ్డాడు రాఘవేంద్ర రావు.

డక్టరు సాయం చేశాడు వారం రోజుల్లో వుద్యోగంనించి అనారోగ్య కారణాల వలన రిటైరయ్యాడు, మరో పదిహేను రోజుల్లో ప్రావిడెంటు ఫండు అందింది, అందిన రోజునే శంకర్రావుకు టెలిగ్రాం యిస్తే, మూడోనాటికల్లా శంకర్రావు అతని ముందు ప్రత్యక్షమయ్యాడు. వచ్చిన వెంటనే శంకర్రావు ఆనందం ప్రకటించాడు. ఆ ఆనందం భార్యని తిరిగి తీసుకువెళుతున్నందుకు కాదు.

"మీ శిష్యుణ్ణనిపించుకున్నందుకు నాకివ్వాళో గుర్తింపు వచ్చిందా సార్" అన్నాడు వసూనే.

అందరకీ ఆశ్చర్యం కలిగింది. "ఏవిటా గుర్తింపు?" రాఘవేంద్రరావు అడగకుండా వుండలేకపోయాడు.

"ప్రజావాణి" పత్రిక నిర్వహించిన కథల పోటీలో నా కథకి ఫస్ ప్రైజ్ వచ్చిందని నిన్ననే టెలిగ్రాం వచ్చింది.



"ఏ కథ?" - రాఘవేంద్రరావు ఆత్రంగా అడిగాడు.

"ప్రతీ ఇంటి కథే" అన్న పేరుతో వరకట్నం గురించి రాసానండి.

రాఘవేంధ్రరావు వీపుమీద ఎవరో చరిచినట్టయింది." "అదిరాసిందినువ్వా?" అంటూనే మనసుని గతానికి మళ్ళించి "ఎవరో రాజారావటకదూ. 'సుగుణ అనే కలంపేరుతో...." మెల్లిగా గొణిగారు.

"ఆ రెండుపేర్లూ నావేనండి నా పేరుతో ఎప్పుడు పోటీకి కథపంపినా లాభం వుండటంలేదని ఈ సారి ఈ గమ్మత్తు చేశాను. మా ఫ్రెండు ఎడ్రసిచ్చాను. పేరు మార్చాను. రేపు పత్రికలో నా బయోడేటా వేసేటప్పుడు నా అసలు పేరు రాస్తాను. ప్రైజు రెండు వేలు" శబ్దం చెయ్యని నవ్వు నవ్వాడు శంకర్రావు.

రాఘవేంద్రరావు మనసు పరిపరి విధాలా ఆలోచించనారంభించింది. మనిషిలో మరోమనిషి వుంటాడంటారు. అది నిజమే కావచ్చు. కానీ, మనసులో కూడా మరో మనసు వుంటుందా? మనసుకి యిన్ని నాలుకలా? వరకట్న దురాచారాన్ని కథలో చెండాడిన శంకర్రావు నిజజీవితంలో....

మధ్యాహ్నం కవితని తీసుకుని శంకర్రావు ప్రయాణమయ్యాడు. స్టేషనుకు వెళ్ళాడు రాఘవేంద్రరావు. దారి పొడుగునా శంకర్రావు పెళపెళ మాట్లాడుతూనే వున్నాడు.

"మీరు మహారచయితలు మీకు చెప్పవలసిన వాణ్ణి కాదనుకోండి" అంటూనే తనకి చాలా సలహాలు యిచ్చాడు.

"నిస్వార్థంగా బ్రతకమనడం చాలా సుళువు. కాని బ్రతకడం మాత్రం చాలా కష్టం. రచయితలు రచయితల్లాగే వుండాలి గాని ప్రవక్తలు కాకూడదండీ. సందేశాలు కథల్లో తప్పకుండా యివ్వాలి, అందువల్ల కథకి విలువ పెరుగుతుంది. సందేశాలు అంతవరకే! చెప్పిన ప్రతి సందేశానికి మనమే వుదాహరణగా నిలబడాలంటే మనం మట్టికొట్టుకుపోతాం. ప్రజలని పాలిస్తున్న నాయకులే చెప్పిందొకటి, చేస్తుంది మరొకటిగా బ్రతికేస్తున్నారు, మనం పాఠకులమీద బ్రతికేవాళ్ళం. వాళ్ళకి నచ్చేది రాయడం, పోటీ కథలకైతే ప్రైజు వచ్చే విధంగా కొన్ని మలుపులు యివ్వడం మంచిది. నేను మొన్న అలాగే చేశాను. ఫస్ట్‌ప్రైజ్ వచ్చింది. శ్రీరాముడి వేషంవేసిన నటుడు ఆ వేషాన్ని బాగా పోషించాడా లేదా అన్నదే చూడాలి గాని, నిజజీవితంలో అతను శ్రీరాముళ్ళా వుంటున్నాడా లేదా అని చూడకూడదు మన రచయితలమూ అంతే! ఏమంటారు?"

రాఘవేంద్రరావు ఏమీ అనలేదు మాటలు వింటున్నాడు. మనసు ఎక్కడో వుండి ఏదో ఆలోచిస్తున్నాడు. ట్రైను కూత వేసింది. గార్డు విజిల్ వేశాడు. కవితని చూశాడు రాఘవేంద్రరావు. కమ్మగ నవ్వడంలేదుగాని కళ్ళలో నీడులేదు. చిన్న మెరుపుంది. కాస్త తృప్తనిపించింది. బండి కదులుతుందనగా శంకర్రావు టక్కున అన్నాడు :

"ఇంతకీ నాకు ఫస్ట్‌ప్రైజ్ వచ్చినందుకు శిష్యుణ్ణి అభినందించారుకారేం?" అంటూ తనే కుడిచేతిని ముందుకు చాచాడు.

రాఘవేంద్రరావు కుడిచేతికి పక్షవాతం వచ్చినట్లుగా ముందుకి సాగలేదు. "భగవాన్! ఈ క్షణంలో రైలు కదిల్తే బావుణ్ణు" అనుకున్నాడు మనసులో. అతని మనోబలం గొప్పదేమో మరి రైలు మెల్లిగా కదిలింది. చెయ్యి చాపవలసిన అవసరం తప్పినందుకు రవంత తృప్తి కలిగింది రాఘవేంద్రరావుకు. ట్రైను పది అడుగులు వెళ్ళకముందే శంకర్రావు తనవైపు తిరిగి "మీ ప్రోనోటు యివ్వడం మర్చిపోయాను. తీస్కోండి" అంటూ ప్లాట్‌ఫాంమీదకి నోటు విసిరేశాడు. రాఘవేంద్రరావు వెళ్ళి ఆ కాగితాన్ని తీసుకుని వెళుతున్న ట్రైన్‌ని అలా చూస్తున్నాడు

"ప్రతీ యింటి కథే"లో రచయిత

ఆఖర్న చెప్పిన మాటలు మనసులో మెదులుతున్నాయి.

"మార్పు రావాలని, సంఘం మారాలని ప్రతివాడూ వుపన్యాసాలిచ్చేవాడే ; కానీ ప్రతిమనిషి ఆ మార్పును ఎదటి మనిషి నించి ఆశించినాడేగాని తను కోరుకున్న నూతన సమాజంలో తనే తొలి మనిషిగా మారాలని తపించడంలేదు. యువతరం చేసే తెగింపే యీ సమస్యలకి ముగింపు. ఆశయాలు వల్లించడం వలన లాభం లేదు..." మాటలు మనసులో కదులుతుంటే కళ్ళలో నీరు తిరుగుతోంది. చేతిలో ప్రోనోటు కాగితం గాలికి రెపరెపలాడుతుంటే నోటు వైపు చూసి చిత్రంగా నవ్వాడు రాఘవేంద్రరావు.




శీతాకాలంలో తడిఆరిపోయిన చర్మానికి చిరునవ్వుతో వీడ్కోలు-పాండ్స్ కోల్డ్ క్రీమ్

శీతాకాలపు చలి, సున్నితమైన మీచర్మాన్ని బాధిస్తోందా? మీ పెదవులపై, కళ్ళపై చిరునవ్వును ఆరిపోయేలా చేస్తోందా? చర్మం తడి ఆరిపోతోందా? అయితే చర్మాన్ని సంరక్షించుకోడానికి యిప్పుడు మీరు వాడాలి, ఆ తేమని ఆరిపోనియ్యకుండా చేసే,




పోషణనిచ్చే సహజరూపంలోని మానెలను సమకూర్చే క్రీమ్, పాండ్స్ కోల్డ్ క్రీమ్. ముఖంపైన, మెడపైన, ముంజేతులు, కాళ్ళు, అవసరమైన ఏ భాగానికైనా సరే రాయండి పాండ్స్ కోల్డ్ క్రీమ్. ఇంక మిలమిలలాడే చర్మం మీది.

శీతాకాలంలో మీ చర్మాన్ని సంరక్షించే సౌందర్యపు మానెలగని

పాండ్స్

లింటాస్-CPC.7-203 TL (R)